ప్రమాదంలో ప్రజారోగ్యం

చెత్తకుప్పలో పడేసిన ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు

- పల్లెలు, పట్టణాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- రోజుకు 68 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం అమల్లో ఉన్నా చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా.. ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతుంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటుంది. జీవమనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర, పురపాలక సంస్థలు వైఫల్యం చెందాయన్న విమర్శలు బలంగా వినపడుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పొరేషన్‌తో పాటు హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఈ పట్టణాల్లో దాదాపు 10.45 లక్షల జనాభా ఉంది. రోజూ 422 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తలో సుమారుగా 68 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని అధికారులే తెలిపారు. అంటే నెలకు 1,845 టన్నులు, ఏడాదికి సరాసరి 22 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక గ్రామాల్లో వినియోగం సరేసరి. సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే పురపాలక శాఖ అధికారులు దాడులు చేసి జరినామా వేయవచ్చు. రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా అపరాధ రుసుం విధించవచ్చని అధికారులే చెబుతున్నారు. అయినా దాడులు నామమాత్రమే.

సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే....

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సచివాయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికి ప్లాస్టిక్ నిషేదం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అక్కడక్కడ పురపాలక సంఘాల్లో సచివాలయ పర్యావరణ కార్యదర్శులు బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పట్టుకున్నప్పటికి వారికి విధించే జరిమానాలు తక్కువ ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించడం లేదు. నిషేధాన్ని కఠినంగా అమలు చేయడానికి పర్యావరణ కార్యదర్శులు నిర్లక్ష్యం వీడి దాడులు నిర్వహించి, జరిమానాలతో పాటు కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తే తప్ప పూర్తి స్థాయిలో నిషేధం అమలు కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడపడితే అక్కడ...

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల కాలువలకు అడ్డుపడి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రయినేజీలపై బండలు వేయడం, వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేధం ఉన్నా.. అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

ఓ ట్రాన్స్‌పోర్టు వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ (ఫైల్ ఫొటో)

ముంచుకొస్తున్న ముప్పు

ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు తేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన 'కార్సినోజన్లు' శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని, చర్మ వ్యాధులు, సంతానలేమి వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంట్లో మిగిలిన ఆహారం, కూరగాయల వ్యర్థాలు ఈ బ్యాగుల్లో వేసి చెత్తకుండీల్లో వేస్తున్నారు. వీటిని మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ భూమిపొరలో చేరి భూగర్భంలో కాలుష్యం ఏర్పడుతోంది. ప్లాస్టిక్ కాల్చివేయడం వల్ల అందులోని రసాయనాలు వాతావరణంలో కలిసి మానవ, జీవరాశుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉంది. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విస్తృత దాడులు చేస్తాం

యాభై మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఎక్కడైనా వినియోగిస్తే దాడులు చేసి చట్టపరమైన చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తాం. పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న శానిటేషన్ సెక్రటరీలతో పాటు ఇతర సెక్రటరీలను టీంగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తాం. ఒక ప్రణాళికతో త్వరలో పట్టణంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తాం.

సంగం శ్రీనివాసులు
మున్సిపల్ కమిషనర్

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

డిఇఓ కార్యాలయ ముట్టడిలో డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిరుద్యోగ సమస్య పెరిగిన నేపథ్యంలో తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం స్థానిక డిఇఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు మునుపు ఆర్ట్స్ కళాశాల నుంచి డిఇఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకం పెట్టిన చంద్రబాబు డీఎస్సీ అభ్యర్థులను మొదటికే మోసం చేశారని విమర్శించారు. 10 నెలలు గడిచిన మొదటి సంతకాన్ని అమలు చేసే పరిస్థితి లేదన్నారు. వారంలోనే మెగా డీఎస్సీని విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికి అనేక ప్రకటనలు చేసి నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారని తెలిపారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేసినా పట్టించుకోకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్కడికి వెళితే అక్కడే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతపురం జిల్లాకు డీఎస్సీలో 1000 ఎస్‌జిటి పోస్టులు పెంచాలన్నారు. జిల్లా అభ్యర్థులందరికీ ఒకే పేపర్ ఉండేలాగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో కూడా ద్వితీయ ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయాలన్నారు. అనంతరం డిఇఓ ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నూరుల్లా, సురేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దు, పరమేష్, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, భీమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వడ్డీ కట్టించుకొని రైతుల రుణాలు రెన్యువల్ చేయాలి

ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతుల బంగారు రుణాలకు వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, వలి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్, కెనరా బ్యాంక్ మేనేజర్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్, ఎపిజిబి మేనేజర్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పెట్టుబడి ఖర్చులకు వడ్డీ వ్యాపారస్తుల నుండి అప్పులు చేసి కుటుంబంలో ఉన్న కొద్ది బంగారం బ్యాంకుల్లో తాకట్టు పెట్టి పంటలు సాగు చేశారన్నారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం రాకపోగా అప్పులు, ఆత్మహత్యలే మిగులుతున్నాయన్నారు. పెట్టుబడికి వడ్డీ వ్యాపారస్తుల నుండి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కూడా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో రైతాంగం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ సంఖ్యలో కరువు మండలాలను ప్రకటించి పంట నష్టపరిహారం ఇన్సూరెన్స్ ప్రకటించకుండా రైతులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకులలో రైతులు బంగారు రుణాలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలకు అసలు వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకోవాలని పై నుండి ఆదేశాలు వచ్చాయని బ్యాంకు అధికారులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో అసలు కట్టాలంటే వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందన్నారు.కావున రైతులకు నష్టం చేసే అసలు వడ్డీ కట్టమని వచ్చిన ఆదేశాలు రద్దుచేసి పాత పద్ధతిలోనే రెన్యువల్ చేసేవిధంగా కింది స్థాయి బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చి పాత పద్ధతిలోని బంగారు రుణాలు పంట రుణాలు రెన్యువల్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అదే విధంగా పంట రుణాలు రెన్యువల్ దృష్ట్యా బ్యాంకుల వద్ద తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాన్నారు. బ్యాంకులకు వచ్చిన సర్క్యులర్లకు తెలుగులో నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. ప్రతి రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని కోరారు. మార్టిగేజ్ (తాకట్టు) లేకుండా పంట రుణాలు రూ. 5 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అందరినీ కలుపుకుని పోవాలి

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు

ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మీ ప్రాంతంలో ఉన్న నాయకులు, కార్యకర్తలందర్నీ కలుపుకుని ముందుకెళ్లాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్టీ క్లస్టర్లు, ముఖ్య నాయకులకు సూచించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో పార్టీ పరిశీలకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరిగింది. పార్టీ క్లస్టర్లు, ముఖ్యనాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు జరిగిన సభ్యత్వాలు, సభ్యత్వ కార్డుల పంపిణీ, డివిజన్లలో పార్టీ పరిస్థితి గురించి చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో అందర్నీ కలుపుకుపోవాలని, పార్టీలో అందరూ సమానం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అబ్జర్వర్ కొంకతి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో పార్టీ పదవులు ఉంటాయని.. కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో న్యాయం జరుగుతుందన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు మనం ఇప్పటి నుంచి సన్నద్ధంగా ఉండాలని సూచించారు. అనంతపురం నగరపాలక సంస్థ పీఠంతోపాటు, నాలుగు పంచాయతీలు కవసం చేసుకోవాలని నాయకులకు తెలిపారు. పార్టీలో గ్రూపులు పెట్టుకుని పార్టీ కార్యక్రమాల దూరంగా ఉండటం వంటి చేస్తే అధిష్టానం సహించదని స్పష్టం చేశారు. మరోవైపు పార్టీ పరిశీలకులు కొంకతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతం కంటే అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని ఇంకా మన బలాన్ని పెంచుకునే విధంగా పని చేయాలన్నారు. కేఎస్ఎస్ లో ప్రతి ఒక్కరూ నమోదు కావాలని సూచించారు. కేఎస్ఎస్ లో ఉంటేనే భవిష్యత్ లో ఎలాంటి పదవులైనా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, అనంతపురం ఆస్పత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కోణంకి గంగారం, టిడిపి నాయకులు ముక్తియార్, సరిపుటి రమణ, ఏం లేదు నారాయణస్వామి యాదవ్, గోపాల్ గౌడ్, వన్నూరప్ప, సాకే లక్ష్మీనరసింహా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామి రెడ్డి తాగునీటి పథకం కార్మికుల

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప విమర్శించారు. తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పట్టణంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్ హౌస్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె మంగళవారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తారన్న కార్మికుల ఆశాలు నీరుకారాయన్నారు. జిల్లాలో అనేక గ్రామాలకు తాగునీరందిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలోని కార్మికులకు 30 నెలల వరకు పిఎఫ్ బకాయిలున్నాయని దీనిపై అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. ఓ వైపు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే అధికారులు తమకేమీ పట్టనట్లు ఉన్నారని విమర్శించారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతూ ప్రజలను, కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్మికులకు అందాల్సిన వేతనాలు,పిఎఫ్ వెంటనే చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులకు పక్షాన సిపిఎం కూడా ఆందోళనలు నిర్వహిస్తుందని ఆయన హెచ్చరించారు.కార్మికుల సమ్మెకు ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, మండల అధ్యక్షులు రంగనాథ్, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, అల్లాబకాష్, గంగాధర, నరేష్, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ఎడిఎఫ్ఒ లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎడిఎఫ్ఒ లింగమయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని టవర్‌క్లాక్, బస్టాండ్ ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది తమ శకటాలను ప్రదర్శించి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి పరికరాలను వినియోగించి నివారించవచ్చని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం రైల్వేస్టేషన్‌కు చేరుకుని స్టేషన్‌మాస్టర్, రైల్వే సిబ్బంగదికి ఎలక్ట్రికల్ ఫైర్, గ్యాస్‌ఫైర్ జరిగితే ఎలా నివారించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె. కృష్ణకుమార్ ఎల్ఎఫ్, ఎస్.రమేష్ కుమార్‌రెడ్డి ఎల్ఎఫ్, ఇ.ఈరేష్‌గౌడ్ డిఒపి, యు.బాగారెడ్డి ఎఫ్ఎంజి, తిప్పేసామి వంశీకృష్ణ, రమేష్, సి.మధుసూదన, కె.జయరాముడు, కె.అనిల్‌కుమార్, బి.సుధాకర్, బి.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నేలకొరిగిన అరటి పంట పరిశీలన

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి గంగనపల్లి, బి.పప్పూరు గ్రామాల్లో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, అకాల వర్షాలకు నేలకొరిగిన అరటి పంటను జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్, మండల ఉద్యాన అధికారి శైలజ మంగళవారం పరిశీలించారు. అలాగే హెచ్.సోదనపల్లిలో దెబ్బతిన్న మామిడి తోటలను రైతు సేవాసిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన పొలాలు క్షేత్రస్థాయిలో సందర్శించి పంట నష్టం అంచనా వేసి జాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణాధికారి హరిచరణ్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం సిబ్బంది దివ్య, శశిధర్, రైతులు పాల్గొన్నారు.

నేలకొరిగిన అరటితోటను పరిశీలిస్తున్న అధికారులు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, కార్యదర్శులు వెంకట్ నారాయణ ముత్తూజ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజి, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు మూడేళ్ల క్రితం చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే వారికి రావాల్సిన డెత్ బెనిఫిట్ స్కీం, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పెరిగిన నగరానికి అనుగుణంగా, కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని కోరారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవు చెల్లించాలని, అదనపు కార్మికులకు రూ.15వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, రవి, రాఘవ, పెన్నా కమల్, నల్లప్ప, ప్రభాకర్, జయరామ్, ఇమాంబి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

బొమ్మనహాల్ : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీధర్‌ఘట్ట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కుమార్‌రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గోవిందవాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు దేశాభివృద్ధికి అవరోధమన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం ద్వారా అనే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కావున బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్స్ మల్లమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యుడు, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శిల్ప

రాయదుర్గం : పట్టణంలోని 15వ వార్డు సచివాలయంతోపాటు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళ శిల్ప మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో 27వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నిజాముద్దీన్, 17వార్డు ఇన్‌ఛార్జి బషీర్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

కూలీలతో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న సుమారు 11వారాల ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి కూలీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కూలీలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 8 నుంచి 11 వారాల పని బిల్లులు పడకపోతే కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదన్నారు. అలాగే పనులు చేసే చోట కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పనులు చేసే చోట మంచినీరు, టెంటు, నీడ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వీటితోపాటు పనిముట్లు అందించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య, వెంకటేశులు, పుల్లయ్య, ఉపాధి హామీ కూలీలు, మెట్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జెండా ఆవిష్కరణ

జెండాను ఎగురవేస్తున్న రైతుసంఘం నేతలు

పామిడి : మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం సీనియర్ నాయకులు ఆర్.ముత్యాలు మాట్లాడుతూ ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన బుక్‌లెట్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, శంకర, మల్లేష్‌పాల్గొన్నారు.

నేడు సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీ

నార్పల : నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల రైతులకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీ చేయనున్నట్లు టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) తెలిపారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీకి కలెక్టర్ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 20వతేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్షులు జగదీష్ అధ్యక్షత మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటియు అనుబంధ ప్రజాసంఘాలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామన్నారు. ముఖ్యంగా బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కాపాడుకుందామన్నారు. బడా కంపెనీ అధినేతల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారానికి 90 గంటలు పెట్టాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. లేబర్ కోడ్‌లు కార్మికులకు ఉరితాడులా మారాయని, వాటితో ప్రశ్నించే హక్కు కోల్పోతామన్నారు. యాజమానిదే పెత్తనం అవుతుందన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్ అడిగే హక్కు ఉండదన్నారు. యూనియన్ ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. కార్మికులు పూర్తిగా కట్టు బానిసలుగా మారే పరిస్థితి ఉందన్నారు. అలాగే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు పని ఒత్తిడి తగ్గించాలని, పెరిగిన జనాభా ఆధారంగా అదనంగా ఆశావర్కర్లను నియమించాలన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఆటో కార్మికులకు వాహన మిత్ర ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలని, డ్రైవర్లకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మా, గంగా, శైలజ, ఆశా యూనియన్ నాయకురాలు ప్రమీల, శ్రామిక మహిళా నాయకురాలు రంగమ్మ, విద్యుత్ యూనియన్ నాయకులు బాషా, రాము, మున్సిపాలిటీ యూనియన్ నాయకులు రంగనాయకులు, సురేష్, శామ్యూల్, ఆటో యూనియన్ నాయకులు హరి, గోపాల్, భవన నిర్మాణ కార్మిక నాయకులు జాకీర్, హమాలీ యూనియన్ నాయకులు రాము, శంకర్, రైల్వే యూనియన్ నాయకులు సుధాకర్, చిన్న వ్యాపారస్తులు సంఘం నాయకులు హాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం 49 డివిజన్ గంగా నగర్‌లో రాజహంస వెంచర్‌కు మంచినీటి సౌకర్యం కల్పన కోసం చేపట్టిన భూమి పూజ కార్యక్రమానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎమ్మెల్యేని కలిసి శ్రీశ్రీ నగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీధిలైట్లు, మంచినీటి కుళాయిలు, సిసి రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వచ్చే వారంలో మీ కాలనీకి వచ్చి స్థానిక సమస్యలు పరిష్కారం చేయడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కాలనీ కమిటీ నాయకులు రాఘవ, హరి, రాజు, నాగరాజు, వెంకటేష్, రహమత్బి, సావిత్రమ్మ, దివ్య, నాగమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నార్పల : మండల పరిధిలోని తుంపెర గ్రామంలో వర్షానికి ఇల్లు కూలిన బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ (బాబు) ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం తుంపెరకు వెళ్లి బిసి కాలనీలో ఇల్లు కూలిన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

పంట నష్టం అంచనా వేయండి

పుట్లూరు : నియోజకవర్గం పరిధిలోని నార్పల, పుట్లూరు మండలాల్లో కురిసిన భారీ ఈదురు గాలులు, వర్షానికి నష్టపోయిన పంటల వివరాలను అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరా స్తంభాలు, విద్యుత్ తీగలు వంటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ఉన్నా, లైన్లు తెగిపోయినా వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలని సూచించారు.

టిబి, చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు

పుట్లూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో సివై టిబి, చర్మ వ్యాధికి సంబంధించిన పరీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా 15 మందికి లాబ్ టెక్నీషియన్ మహబూబ్‌బాషా సివై, టిబి చర్మ పరీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీల్, నాగరాజు, కిరణ్ కుమార్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళ కుటుంబానికి సాయం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఒంటరి మహిళకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు కమలాకర్ సతీమణి భాగ్యలక్ష్మి, కుమారుడు లక్ష్మీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఒంటరి మహిళకు రెండు నెలలకు సరిపడ 33 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం ప్యాకెట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వకార్డులు పంపిణీ

శింగనమల : మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా పని చేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, నాయకులు గోరంట్ల మారుతీనాయుడు, ఉల్లికల్లు రంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీగా మారుతీ నరసింహ

నార్పల : ఎపి రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా నార్పల మారుతీ నరసింహ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మారుతీ నరసింహ మాట్లాడుతూ తనను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించినందుకు బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ సోదరులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు అభినందన

రాయదుర్గం : ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యక్షతన అభినంఇంచారు. ఇందులో భాగంగా ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 21మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీరేష్, ఆదిల్‌బాషా, శ్రీనివాసులు, వెంకటేశులు, గోవింద్‌రెడ్డి, అక్కుల్‌రెడ్డి, రూపావతి, అరుణ, నజీర్ అహ్మద్, గంగాధర్, చంద్రశేఖర్ ఆజాద్, బయపరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన ప్రజాసంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా నాగేంద్ర

శింగనమల : దళిత, గిరిజన ప్రజాసంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా కొర్రపాడు నాగేంద్ర ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం బుక్కరాయసముద్రం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగేంద్రను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గతంలో బుక్కరాసముద్రం మండల అధ్యక్షులుగా ఉంటూ ఎన్నో ఉద్యమాలు చేశానని గుర్తు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. దళిత, గిరిజన ప్రజా సంఘాన్ని నిర్మాణం చేసుకుంటూనే సమాజంలో జరుగుతున్న అసమానతలను రూపుమాపేందుకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన ప్రజాసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్ నిజమ్, గిరిజన ఐక్యసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కేశవనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

డాక్టర్ రోహినార్

ప్రజాశక్తి-శింగనమల

ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సిహెచ్‌సి వైద్య నిపుణులు డాక్టర్ రోహినార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతోందన్నారు. తీవ్ర వడగాలులు వీస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీనికితోడు అకాల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేప్పుడు చెట్ల కింద ఉండరాదన్నారు. ఒకవేళ ఎండకు వెళ్లినప్పుడు తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జర్వం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఒకవేళ బయటకు వెళ్లాలంటే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెత్తికి టోపీ పెట్టుకోవడం, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించడ, కళ్ల రక్షణ కోసం అద్దాలను వినియోగించాలన్నారు. దాహం వేయకపోయినా తరుచుగా నీటిని తాగుతూ ఉండాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఒఆర్ఎస్ కలిపిన నీటిని తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకుంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు.

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో వినతులు

రాప్తాడులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాప్తాడు

వడ్డీ కట్టించుకుని రైతులు బంగారంపై తీసుకొచ్చిన రుణాలను రెన్యూవల్ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల నాయకులు పోతలయ్య మాట్లాడుతూ జిల్లాలోని రైతులు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులకు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు చేసి, తమ భార్యల మెడలో ఉన్న బంగారం, పుస్తెలను తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకున్నారన్నారు. చివరకు పంటలు సాగు చేసి గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. డ్వాక్రా మహిళలు కూడా పంటల కోసం డ్వాక్రాల్లో రుణాలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో రైతుల బంగారు రుణాలను కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని కోరారు. అలాగే ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని, మహిళలకు తాకట్టు లేకుండా రూ.5 లక్షల వరకూ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సుబ్బిరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, పెద్దపోతలయ్య, అంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని రైతుల బంగారు రుణాలకు వడ్డీ కట్టించుకుని రెనూవల్ చేయాలని రైతుసంఘం నాయకులు మండల కేంద్రంలో తహశీలాద్ర్ ఉషారాణి, యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకట శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, నాయకులు సుధీర్‌రెడ్డి, కదిరప్ప, మస్తాన్, పుల్లన్న, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

49, 50వ డివిజన్ల ఖాజీగా షేక్ నూర్‌మహ్మద్

ఖాజీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 49, 50వ డివిజన్ల ఖాజీగా షేక్ నూర్ మహ్మద్ నియమితులయ్యారు. ఎన్నికల ముందు అర్హులైన ఇమామ్‌లకు ఖాజీలుగా అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు. హామీ మేరకు ఖాజీగా నూర్ మహ్మద్‌కు ఎమ్మెల్యే ప్రతిపాదించడంతో ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఖాజీగా నూర్ మహమ్మద్ నేటి నుంచి పదేళ్లపాటు కొనసాగనున్నారు. దీంతో ఖాజీ నూర్‌మహ్మద్‌తో మైనార్టీలు ఎమ్మెల్యేను అర్బన్ టిడిపి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, జాఫర్ ఖాన్, బాబా జమాలుద్దీన్, హాసిఫుద్దీన్, బదురుద్దీన్, మాబు, హజ్మతుల్లా, ఫర్హాన్, ఇమ్రాన్ ఖాన్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సరిగ్గా నెలరోజుల్లోపు మున్సిపల్ స్థలాలు ఆక్రమణలపై చర్యలు తీసుకుని, ఎక్కడికక్కడ కంచెలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజారోగ్య, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందులో మున్సిపల్ స్థలాలు ఆక్రమణపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సెంట్రల్ పార్క్‌తో పాటు ఆక్రమిత స్థలాల్లో కంచెలు వేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఒక్క ఫిర్యాదు కూడా ఇందుకు సంబంధించి రాకూడదన్నారు. అలాగే ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం ఎక్కువగా వేస్తున్నారని ఇలాంటి ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్నారు. వీటిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సేకరించే వాహనాలు కొన్ని కాలనీలకు వెళ్లకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అన్ని కాలనీలకు వాహనాలు వెళ్లేలా చూడాలన్నారు. అక్రమ కట్టడాల విషయంపై ఇటీవల పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయని, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎక్కడెక్కడ అక్రమ కట్టడాలు ఉన్నాయన్నది వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ బాలస్వామి, ఎస్ఇ చంద్రశేఖర్, ఇఇ షాకీర్, నరసింహులు, టౌన్ ప్లానింగ్ అధికారులు శిరీషా, మంజులమ్మ, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసాయి సిద్ధార్థ కళాశాల విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు

విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తాడిపత్రిలోని శ్రీసాయి సిద్ధార్థ కళాశాల విద్యార్థిని ఆర్కాట్ మెహెక్ సుల్తానా 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు కళాశాల యుజమాన్యం తెలిపింది. ఈమేరకు మంగళవారం అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థిని తల్లిదండ్రుల సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వి.రాజశేఖరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మెహెక్ సుల్తానా తండ్రి షామీర్ బాషా పుట్లూరు మండలం చాలవేముల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. తల్లి కలీ మున్నీసా తాడిపత్రిలోని ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

గుంతకల్లు : కేంద్రం ఆమోదించిన వక్ఫ్ బోర్డు నూతన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ, ప్రభుత్వ ఖాజీలు రజ్జాక్ పీరా, సత్తార్‌సాబ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో వక్ఫ్ సవరణ చట్టంపై వివిధ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో అసమానత్వం, మతకల్లోలాను సృష్టిస్తోందన్నారు. ఇందులో భాగమే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అన్నారు. వెంటనే బిల్లును ఉపసంహరించకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మన్సూర్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, వైసిపి పట్టణ అధ్యక్షుడు ఎస్ఎండి ఖలీల్ పాల్గొన్నారు.

17న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వర రావు అధ్యక్షతన ఈనెల 17న గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ భాస్కర్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కోరారు. కావున మండలంలోని బీసీ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా చేయాలి

గుత్తి : పట్టణంలోని అతి పురాతన గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించి అభివృద్ధి చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి వై.రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద తహశీల్దార్ డి.ఓబిలేసు, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి కోట వద్ద హరిత హోటల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కోటపై నుంచి రోప్ వే ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు పి.వెంకటరామిరెడ్డి, కాశీరావు, కోటేశ్వరరావు, కోట గైడ్ ఎం.రమేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ఉరవకొండ : అభయ ఫౌండేషన్, నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వజ్రకరూరు మండల కేంద్రంలో చిరువ్యాపారులకు మంగళవారం ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, తహశీల్దార్ నయాజ్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు మల్లయ్య, అనిల్‌కుమార్, వీఆర్వోలు భరత్, మారెన్న, వన్నూరప్ప, సామాజిక కార్యకర్తలు బెంజిమెన్, మల్లికార్జున, జనసేన మండల కన్వీనర్ అర్చనాల చెన్నకేశవ, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటిలో శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

బెలుగుప్ప : మండలంలోని శ్రీనివాస విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ఐఐటిలో ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ వేముల శ్రీనివాసులు తెలిపారు. పాఠశాలకు చెందిన కె.శశిర, కె.అర్చన, కెజె హరిణి, ఎ.ప్రణతి, వి.భానుజ, బి.లాస్యప్రియ, వి.శివసాయి, టి.హేమశ్రీ, కె.గాయత్రి, ఎ.సాయిస్వప్న ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను గుంటూరులో జరిగిన 11వ ఈ అభ్యాసోత్సవంలో పతకాలు అందజేసి అభినందించినట్లు వివరించారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం

ప్లాస్టిక్‌పై అవగాహనక కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వినియోగిస్తే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణంలోని కటిక బజార్, గాంధీ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, అనంతపురం రోడ్డు ప్రాంతాల్లో వర్తక దుకాణాదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

18న వికలాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఎపి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18వతేదీ నుంచి ఆర్డీటీ స్టేడియంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు కమిటీ ఛైర్మన్ ఎడ్లపల్లి సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్.. 97034 00870, 63053 54511, 93985 09469 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట అటవీ ప్రాంతంలో కారు–ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో గిరిస్వామి (60) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శింగనమల మండలం జలాలపురం గ్రామానికి చెందిన గిరిస్వామి ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళ్తుండగా ముచ్చుకోట అటవీ ప్రాంతంలోకి రాగానే అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అదుపుతప్పి కింద పడటంతో గిరిస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలిల మేరకు.. గ్రామ శివారులోని కొండపై నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయానికి తాళాలను బద్దలు హుండీలోని నగదును దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు గమణించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హుండీలో రూ.20వేల వరకూ ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.